
**ఉన్నట్టుండి నన్ను అద్దంకి బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ట్రాన్స్‌ఫర్ చెయ్యడం కంటే అద్దంకి బ్రాంచికి చెయ్యడం మరింత ఆశ్చర్యం కలిగించిన విషయం.**

# పనిష్మెంట్




ఇలపావులూరి మురళీమోహన

మా కంపెనీ బ్రాంచీలు దాదాపు ఇండియా అంతా విస్తరించి ఉన్నాయి. కానీ అద్దంకి బ్రాంచికి ఒక ప్రత్యేకత ఉన్నది. కంపెనీ ఉద్యోగులెవరి మీదైనా క్రమశిక్షణా చర్య తీసుకోదలిస్తే అద్దంకి బ్రాంచ్‌కి బదిలీ చేస్తుంటారు మా ఉన్నతాధికారులు.

అప్పుడప్పుడు లంచ్ అవర్‌లో అద్దంకి బ్రాంచ్ గురించి చర్చ వస్తుంటుంది. ఆ బ్రాంచ్‌లో రాజకీయాలెక్కువ. అలాగే అవినీతి కూడా ఎక్కువే. అక్కడి ఎంప్లాయీస్‌లో ఒకరంటే ఒకరికి పడదు. గిల్లికజ్జాలు సర్వ సాధారణం. నెల రోజులు అక్కడెవరైనా పని చేశారంటే ఆ వాతావరణంలో ఇమడనైనా ఇమడాలి. లేదా ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోవాలి. మాకు తెలిసిన వారిలో ఎవరికైనా అద్దంకి ట్రాన్స్‌ఫర్ చేస్తే లోలపల పగలపడి నవ్వుకుని పైకి సానుభూతి చూపేవాళ్ళం.

నేను ముక్కు సూటి మనిషిని. నిష్కల్మషంగా ఉండడం నిష్కర్షగా మాట్లాడడం నాకు జన్మతః వచ్చిన లక్షణాలు. నీతి నిజాయితీ నా ఆరోప్రాణం. ఉన్నదాంట్లో సర్దుకు పోవడం తప్ప ఒకరి బలహీనతలను , అవసరాలను సొమ్ము చేసుకోవడం, అందని దానికి అర్రులు చాచడం నా విధానం కాదు.

ఈ ముక్కు సూటితనమే ఒక అవినీతి వ్యవహారంలో మేనేజర్‌తో లాలూచీ పడక పోవడానికి, ఫలితంగా అద్దంకికి ట్రాన్స్‌ఫర్ కావడానికి కారణమైంది.

అయినా నేను భయపడలేదు. నిజాయితీగా బ్రతికేవాడికి ఈ ప్రపంచంలో ఎక్కడైనా చోటు దొరుకుతుందనేది నా విశ్వాసం. కాకపోతే పిల్లలకు టీ. సీ. లు తీసుకోవడం, మళ్ళీ అక్కడి స్కూల్స్‌లో చేర్పించడం, అక్కడి యూనిఫామ్, బుక్స్ వగైరాలు... కొంచెం ఖర్చు, శ్రమతో కూడుకున్న వ్యవహారాలు.

మేనేజర్ కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమలాడుకోమని చాలా మంది సలహాలిచ్చారు. బట్... ఐ డోన్ట్ కేర్. వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను.

అదంకి ఒక చిన్న పట్నం —ముందు అక్కడికి వె[illegible]క్యూటీలో జాయినై ఇల్లు వాకిలి వెతుక్కుని తరువాత భార్యా పిల్లలను తీసుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. ఫలానా రోజున వస్తున్నానని, ఎవరినైనా బస్టాండుకు పంపమని ముందు రోజు అద్దంకి బ్రాంచ్ మేనేజర్‌కు టెలిగ్రామ్ ఇచ్చాను.

హైదరాబాద్ నుండి దాదాపు తొమ్మిది గంటల ప్రయాణం తరువాత ఉదయం ఆరు గంటలకు అద్దంకి బస్టాండులో దిగాను. నా కోసం ఎవరైనా వచ్చారేమోనని అటు ఇటు చూడసాగాను.

ప్రయాణీకులంతా దిగిపోతున్నారు. ఒక వ్యక్తి దిగుతున్న ప్రతి వాడినీ చూస్తూ అటు ఇటు వేగంగా అడుగులు వెయ్యడం గమనించాను.

బస్సు దిగి ఎటూ కదలని నన్ను చూసి అతను నా దగ్గరకు వచ్చాడు.

"మీరు...?" అన్నాను సందేహంగా.

"హైదరాబాద్ నుంచి మా కంపెనీ 'సూపర్నెంటు' గారు వస్తున్నానని టెలిగ్రామ్ ఇచ్చారు. ఇంతకూ మీరు..."

"హమ్మయ్య... బ్రతికించారు. నేనే ఆ సూప[illegible]టెండెంట్‌ను. ఇంతకూ మీ పేరు..."

[illegible]"ఆఁ... మీరేనా 'సూపర్నెంటు' గారు నమస్కారం సార్. నా పేరు తిరిపాలు. ఆఫీసు ప్యూన్‌ను. ఆ సామానిలా ఇవ్వండి" అంటూ చనువుగా నా సూట్‌కేస్ అందుకున్నాడు.

అతను ప్యూన్ అని తెలిసిన తర్వాత అప్పటి వరకూ అతన్ని బహువచనంతో సంబోధించినందుకు నా అహం దెబ్బతిన్నది. అంతేకాదు. కనీసం ఒక యల్డీసీ స్థాయి వ్యక్తైనా రానందుకు బాధ కలిగింది.


ఇంతలో తిరిపాలు ఒక రిక్షాను తీసుకువచ్చాడు. నేను ఎక్కి కూర్చున్నాను. తిరిపాలును ఎక్కమని అడగలేదు. అతనూ ఎక్కడానికి ప్రయత్నించలేదు.

ఆఫీసు దగ్గర రిక్షా ఆగింది.

"రండి సార్... ఇదే మన ఆఫీసు" సూట్‌కేసు అందుకుని ముందుకు నడిచాడు.

ఆఫీసు వెనుక వైపుకి తీసుకు వెళ్ళి ఒగ గది తాళం తీశాడు.

నీ హనీమూన్ ఎలా జరిగిందే లిల్లీ?
నిజంగా అదొక మరపురాని మధురానుభూతి!
మరి మీవారు ఎలా ఫీలయ్యారు?
'ఆయన్ని కూడా నాతోపాటు హనీమూన్‌కి తీసి కెళ్తే ఇంకా బాగుండేదన్నారు!'
—సి. హెచ్. శర్మ



"ఇది ఆఫీసు రిక్రియేషన్ రూమ్. ప్రస్తుతానికి ఖాళీగా ఉన్నది. మీరు ఇల్లు చూసుకునేంతవరకూ దీనిని వాడుకోమన్నారు మేనేజర్ గారు. అటువైపు టాయ్‌లెట్స్ ఉన్నాయి. రేపో ఎల్లుండో ఇల్లు చూద్దాం" అన్నాడు తిరుపాలు.

"ఊఁ... బాగానే ఉన్నది. నాకు కొంచెం కాఫీ తెచ్చి పెడతావూ ? అది గొంతులో పడితేనే కానీ నా కార్యక్రమాలు ప్రారంభం కావు" అన్నాను డబ్బులిస్తూ.

"అలాగే సార్ —ఇప్పుడే తెస్తాను" అని వెళ్ళాడు తిరిపాలు. రెండు నిమిషాలలో ఫ్లాస్క్, రెండు కప్పులతో తిరిగి వచ్చాడు.

"సార్ కొత్త వారు కదా అని చెబుతున్నాను. ఇక్కడి స్టాఫంతా అదో రకం. కొంచెం జాగ్రత్తగా ఉండండి" కాఫీ గుటక వేయబోతుండగా అన్నాడు తిరిపాలు.

"అంటే ?" ముఖం చిట్లిస్తూ అన్నాను.

"ఇక్కడ ఒకరంటే ఒకరికి పడదు. పైకి నవ్వులు పులుముతున్నా లోపల అంతా విషం" అన్నాడు.

ఈ బ్రాంచ్ గురించి మేము చెప్పుకునే విషయం ఇంత త్వరగా బయటపడుతుందనుకోలేదు. అయినా ఇలాంటి విషయాలు ప్యూనుతో చర్చించడం నా స్థాయికి తగని పని కాబట్టి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాను.

"నాకేం భయంలేదు. నా ముందు ఇలాంటి ఆటలు సాగవు" అన్నాను.

కిసుక్కున నవ్వాడు తిరిపాలు.

"ఇంతకు ముందు చాలా మంది ఇలాగే అన్నారు" నసుగుతున్నట్టుగా అన్నాడు.

సంభాషణ తుంచే ఉద్దేశ్యంతో తిరిపాలు వైపు కోపంగా చూశాను. తిరిపాలు మరి మాట్లాడలేదు.

పది గంటలకు ఆఫీసులో అడుగు పెట్టాను. అందరూ నవ్వు ముఖాలతో నన్ను రిసీవ్ చేసుకున్నారు. పేరు పేరునా పరిచయాలు చేసుకున్నారు. అందరం జోకులేసుకుంటూ నవ్వుకుంటూ కులాసాగా మాట్లాడుకుంటున్నాము.

ఇంతలో తిరిపాలు ఒక బ్రీఫ్ కేసు తీసుకుని లోపలకు వచ్చాడు.

అంతే !

తుపాకీ పేలిస్తే పిట్టలన్నీ ఎగిరిపోయినట్లుగా అందరూ ఉరుకులు పరుగులతో ఎవరి సీట్లలో వారు వెళ్ళి కూర్చున్నారు. నన్ను కూడా వెళ్ళి కూర్చొనమని సైగలు చెయ్యసాగారు.

వారి వైఖరి నాకు ఆశ్చర్యం గొలిపింది.

రెండు నిమిషాలు తరువాత మేనేజర్ లింగమూర్తి ఆఫీసులో అడుగు పెట్టాడు. అప్పటికే ఫైళ్ళు ముందేసుకుని ఎప్పటి నుంచో పని చేస్తున్నట్లు, మేనేజర్ రాకతో తమకు కార్యభంగం అయినట్లు ముఖాలలో భావాలను పలికిస్తూ దగ్గరికి వచ్చిందాకా అసలు మేనేజర్‌ను గమనించినట్లూ, నటిస్తూ గుభుక్కున లేచి విష్ చెయ్యసాగారు.

వారి నటనా వైదుష్యానికి నేను విస్తుపోయాను. లింగమూర్తి తన గదిలోకి వెళ్ళిపోయిన తరువాత నేను వెళ్ళి స్వపరిచయం చేసుకుని జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చాను.

"వెల్. జాగ్రత్తగా మీ పని మీరు చేసుకోండి. ఇతరుల విషయాలలో ఇంటర్‌ఫియర్ కావద్దు. స్టాఫంతా అదో రకం. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నీకు తెలియకుండానే నీ తల మీద సున్నపు బొట్లు పెడతారు. నేను చాలా స్ట్రిక్టు. అందువలన నేనంటే చాలా మందికి పడదు. నా మీద ఏవేవో చెబుతుంటారు. వాటిని నమ్మవద్దు. ఆల్ ది బెస్ట్" అన్నాడు లింగమూర్తి.

పొద్దున తిరిపాలును చూసినట్లు ఇప్పుడు లింగమూర్తిని తీక్షణంగా చూడలేకపోయాను. కారణం లింగమూర్తి నాపై అధికారి. 'అలాగే సార్' అని బైటకు వచ్చాను.

రెండు రోజులలో ఒక మంచి ఇల్లు దొరికింది. ఆఫీసుకు రెండురోజులు శెలవుపెట్టి హైదరాబాదు వెళ్ళి భార్యాపిల్లలను సామానుతో సహా తీసుకొచ్చాను. స్కూళ్ళలో పిల్లలకు అడ్మిషన్స్ తేలికగానే దొరికాయి.

వారం రోజులు హాయిగా గడిచాయి.

ఒకరోజు ఆఫీసులో కూర్చుని పనిచేసుకుంటుండగా క్లర్కు రంగారావు వచ్చి నాముందు కూర్చున్నాడు.

"ఏం చేస్తున్నారు గురువుగారూ" అన్నాడు.

"ఆ.. ఇదే.. ఈనెలలో మన సేల్స్ స్టేట్‌మెంట్ తయారు చేస్తున్నాను. సాయంత్రం లోపల కావాలని మేనేజర్‌గారు చెప్పారు" అన్నాను.

ఇంకొంచె దగ్గరిగా వచ్చాడు రంగారావు.

"రంగ రంగా! ఈ పనిమీరు చేస్తున్నారా? ఇది ఆయల్డీసీ సీతారాం చెయ్యవలసిన పని. వాడు మేనేజర్‌కు కాకాలు పడుతూ ఆఫీసు పనివాళ్ళ మీద వీళ్ళమీదా రుద్దుతూ సొంతపనులు చూసుకుంటుంటాడు" అన్నాడు.

సినీ విలేఖరి: మీపాటలో సాహిత్యం లేకున్నా ఎలా హిట్ కాగలిగిందో ఆ రహస్యం ఏమిటో మా పాఠకులకు వివరిస్తారా
సినీకవి: ఏముంది నాకొచ్చిన బూతులలో కొన్నింటిని కొత్త పద్ధతిలో ప్రయోగించి రాశాను అంతే సెలవిచ్చాడు కవిగారు.

—కారపు వెంకటేశ్వర్లు



"అతనేదో ఆఫీసు పనిమీద బయటకు వెళ్ళాడు. అయినా ఎవరు చేస్తేఏమిటి? ఫలానా వాడు ఫలానా పనేచెయ్యాలనే సిద్ధాంతం నాకు నచ్చదు. ఎవరున్నా ఎవరులేకపోయినా ఆఫీసు పనిమాత్రం ఆగకూడదు" మరో మాటకు అవకాశమియ్యకుండా ఫైల్లోతలదూర్చాను.

రంగారావు ముఖం మాడ్చుకుంటూ వెళ్ళడం గమనించి నవ్వుకున్నాను. అయినా ఇటువంటి వాటిని ఆదిలోనే ఖండించపోతే ఇకవాళ్ళు నన్ను తోలుబొమ్మను చేసి ఆడిస్తారు.

ఎవరో పొడిగా దగ్గినట్లనిపిస్తే తలపైకెత్తాను. ఎదురుగా స్టెనో విశ్వం. మూడో వ్యక్తికి వినపడకుండా చెప్పసాగాడు. "తగాదాలు పెట్టి తమాషాలు చూడటంలో రంగారావును మించినవారు లేరు. చిన్నమెత్తుపనిచెయ్యడు. పోరంబోకు వెధవ. వాడిమీద వీడిమీద చాడీలు చెప్పడమే వాడిపని. జాగ్రత్తగా ఉండండి వాడితో". అని నా సమాధానం కోసం కూడా చూడకుండా వెళ్ళిపోయాడు.

నేను ఆశ్చర్యంగా చూడసాగాను. సూపర్‌వైజర్ ఆంజనేయులు 'హలోసార్' అన్న తరువాత కానీ ఈ లోకంలోకి రాలేకపోయాను.

"వాళ్ళిద్దరూ నా గురించి ఏమైనా వాగారా?" రహస్యంగా అడిగాడు. "అబ్బే.. అదేం లేదు." అన్నాను నవ్వుతెచ్చుకుంటూ.

"ఆఁ..ఆఁ... మీ నవ్వు చూస్తేనే తెలుస్తుంది లెండి. నేను తాగుబోతునని, తిరుగుబోతునని, పేకాటలాడుతానని, చిన్న చిన్న సెటప్పులను మెయిన్‌టెయిన్ చేస్తుంటానని చెప్పి ఉంటారు. ఔనా! అయినా నేనెట్లా ఛస్తే వారికెందుకు? నాడబ్బు. నాయిష్టం దమ్ముంటే వాళ్ళు కూడా అలా చెయ్యొచ్చుకదా! లైఫ్‌ను ఎంజాయ్ చెయ్యడం చేతకాని దద్దమ్మలు." అన్నాడు.

"ఆంజనేయులు గారూ. నిజానికి మీరు ఇటువంటి వారని మీరు చెప్పేవరకూ నాకు తెలియదు. అయినా అలాంటి పనులు చేస్తేనే లైఫ్ ఎంజాయ్ చేసినట్లని మీరు భావిస్తే నేను చెయ్యగలిగిందేమీ లేదు. ప్లీజ్..." అన్నాను చిరుకోపంగా.

ఆంజనేయులు ముఖం చిన్నబుచ్చుకుని వెళ్ళడం కనుకొసలనుండి గమనించి నవ్వుకున్నాను.

లంచ్‌టైమ్‌లో నాపక్కనే అసిస్టెంట్ మేనేజర్ నరసింహం కూర్చున్నాడు.

"ఆఁ.. ఏమిటిసార్? ఎలా ఉన్నదిసార్ ఆఫీసు వాతావరణం? అంతా వాలిసుగ్రీవ సంతతి. ఎప్పుడూ గిల్లికజ్జాలు. నాకు ఇద్దరు భార్యలని అందరికీ కుళ్ళు. దానికి ఓర్వలేక నేను నపుంసకుడినని ప్రచారం చేస్తుంటారు. మీచెవిన కూడా పడేసే ఉంటారు." అన్నాడు.

నాకు ముద్ద దిగలేదు. వాస్తవానికి ఆయన గురించి ఇంతవరకూ ఎవ్వరూ నాతో ఏమీ అనలేదు. "మీరెలాంటి వారో నాకేం తెలుసండీ? అయినా ఒక్క భార్యతోనే మేము వేగలేక ఛస్తున్నాము. మీరు ఇద్దరు భార్యలను ఎలా సంబాళించుకొస్తున్నారండీ?" అన్నాను. పెదవి విరిచాడు నరసింహం.

"ఆఁ ఏం ఇద్దరు భార్యలో నండీ! మొదటి భార్య పిచ్చిది. ఐదు సంవత్సరాల నుండీ ఆసుపత్రిలో ఉన్నది. అందుకని మరో అమ్మాయిని చేసుకున్నాను. అయితే నెల తిరగకుండానే ఆమె మరెవరితోనో లేచిపోయింది. మేమింకా విడాకులు తీసుకోలేదు. పేరుకు ఇద్దరు భార్యలనే కానీ నేనసలు బ్యాచిలర్నే" అన్నాడు.

"ఈ విషయాలన్నీ మీరు చెబితేనే తెలిశాయి" అన్నాను.

క్రమక్రమంగా తిరిపాలు చెప్పింది అక్షరాలా నిజమని ఋజువైంది. ఇలాంటి కబుర్లు నాకు చెప్పవద్దనీ, నాకు అందరూ కావలసిన వారేనని నొక్కి చెప్పాను. అయినా ఫలితం కనపడలేదు.

మరో రోజు నేను ఏదోపని సీరియస్‌గా చేసుకుంటుంటే భజగోవిందం వచ్చిమెల్లగా గొణగసాగాడు.

"ఇది విన్నారా? మన డిప్యూటీ మేనేజర్ సుందరం గారి రెండో అమ్మాయి ఎవడితోనో లేచిపోయిందట. దుర్మార్గుడు! మమ్మల్ని ఎంత ఏడిపించుకుతిన్నాడు? నీతి నిజాయితీ లంటూ మా పొట్టలు కొట్టాడు. వాడిపాపం ఈ రోజుకు పండింది. ఇది మనలో మాట! ఎవరితోనూ అనకండి సుమా."

అంతలోనే సుందరం వచ్చాడు. వెంటనే భజగోవిందం రెండు చేతులూ జోడించి "నమస్కారం సార్. మీలాంటి వారికిలాంటి కష్టం వచ్చిందంటే అసలు దేవుడి ఉనికినే శంకించవలసి వస్తున్నది. ఉపకారం తప్ప అపకారం అన్న మాటకే అర్థం తెలియదే మీకు..." వెక్కివెక్కి ఏడవసాగాడు.

నా ఆవేశం హద్దులు దాటింది. మేనేజర్‌కు కంప్లెయింట్ ఇచ్చి ఇటువంటి సిల్లీ థింగ్స్ అరికట్టకపోతే నాకు పిచ్చెక్కటం ఖాయం అనిపించి మేనేజర్ గదిలోకి వెళ్ళి జరిగింది చెప్పాను.

"రిలాక్స్ మైబోయ్. పిటపిటలాడుతూ గంగిరెద్దులా తిరిగే పిల్లకు పెళ్ళిచెయ్యక పోవడం సుందరం తప్పు. వాడి పొగరు ఇన్నాళ్ళకు అణిగింది. ప్రమోషన్ విషయంలో నాతో పోటీ పడ్డాడు. ఇప్పుడు వాడి కాన్ఫిడెన్షియల్ రిపోర్టు ఛండాలంగా రాసి వాడిని శంకరగిరిమన్యాలు పట్టిస్తాను." పొట్టపట్టుకుని నవ్వసాగాడు లింగమూర్తి.

నోటమాట రాలేదు నాకు. నిశ్శబ్దంగా బయటకు వచ్చాను. ఈ బాధ నుండి విముక్తి ఎలా పొందాలో తెలియక బుర్రబద్దలు కొట్టుకున్నాను. ఆలోచించాగా... చించగా నా బుర్రలో ఒక మెరుపు మెరిసింది.

ఇకనుంచి ఎవరైనా అవతలివారి మీద ఏమైనా చెబితే ఆ విషయాన్ని అవతలివారికి చెబితే, ఆ భయంతోనైనా ఈ న్యూసెన్స్ తగ్గుతుందనిపించింది.

మరుసటిరోజు రంగారావు, ఆంజనేయులు. విశ్వం మొదలగు వారు అవతలివారి మీద చెప్పిన వన్నీ ఆయా వ్యక్తులకు ఫలానా వారు ఈ విధంగా చెప్పినట్లు చెప్పేశాను.

మరునాడు ఎవ్వరూ నా వద్దకు రాలేదు. పీడ విరగడైనందుకు సంతోషించాను. అంతేకాదు. ఈ న్యూసెన్సును వదిలించినందుకు కించిత్ గర్వంకూడా కలిగింది.

కానీ నా ఊహ తారుమారైంది. రెండురోజుల తరువాత ఆఫీసులో గొడవలు మొదలయ్యాయి. ఒకరిమీద ఒకరు పోట్లాడుకోసాగారు. లింగమూర్తి ఇరుపక్షాలను సముదాయిస్తున్నాడు. అయినా తగాదాలు ఆగటంలేదు. ఒకరోజు పోట్లాట కొట్లాటగా మారి ఆంజనేయులు మీద నరసింహం చెయ్యి చేసుకోవడంతో విషయం డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ కొచ్చింది.

నాలుగురోజుల తరువాత లింగమూర్తి నన్ను తన గదిలోకి పిల్చి ఒక కవర్ నాచేతిలో పెట్టాడు. అది నాట్రాన్స్‌ఫర్ ఆర్డర్! "ఏమిటిది సార్?" అన్నాను. ప్రశ్నార్థకంగా చూస్తూ. "అయామ్ సారీ. మీ పనివిధానం మాకు నచ్చలేదు. మీరు వచ్చిన తరువాత ఆఫీసులో శాంతిభద్రతలు కరువయ్యాయి. వాళ్ళమీద వీళ్ళకు, వీళ్ళమీద వాళ్ళకు చాడీలు చెబుతూ, తగాదారు పెట్టి తమాషాలు చూస్తూ, ఆఫీస్ అట్మాస్ఫియర్‌ను భ్రష్టు పట్టించారు. ఈ తగాదాలు, కొట్లాటలకు మీరు చెప్పిన చాడీలే కారణం అని ఎంక్వాయిరీలో తేలింది. మీమీద డిసిప్లినరీ యాక్షన్‌కు రికమెండ్ చేశాను. మిమ్మల్ని నాగాలాండ్ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేస్తూ టెలిగ్రాఫిక్ ఆర్డర్స్ వచ్చాయి. మిమ్మల్ని తక్షణమే రిలీవ్ చేస్తున్నాను. యూకెన్ గో." తలవంచి పనిలో మునిగిపోయాడు లింగమూర్తి.

* * *